సాక్షి
నిజామాబాద్
గురువారం । 12 । జనవరి । 2023



స్కీం పేరుతో టోపీ!

లక్కీ డ్రా స్కీంలో సభ్యులుగా చేరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఆశించిన అనేక మందికి నిర్వాహకులు కుచ్చు టోపీ పెట్టారు.

- 8లో ▸



రాణా భవనానికి మోక్షం

బాల్కొండలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.9 /14.3

పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఉల్లికోడు'పై రైతులు ఆందోళన చెందొద్దు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): వరి పంటను 'ఉల్లికోడు' తెగులు ఆశిస్తున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి ఆర్ తిరుమల ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొగి పురుగు, ఉల్లికోడు తెగుళ్లతో పెద్దగా నష్టం వాటిల్లే అవకాశం లేదన్నారు. ఇందుకు రైతులు పురుగుల మందులను అధికంగా పిచికారీ చేయవద్దని కోరారు. అయితే, నారుమళ్లకు ఈ తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన 800 గ్రాముల కార్బోఫ్యురాన్-3జీ గుళికలు, 600 గ్రాముల ఫిప్రొనిల్ 0.3.జీ గుళికలు వేయాలన్నారు. నాట్లు వేసిన వరికి కూడా పిలకదశలో ఉంటే రైతు వేదికల్లో అందుబాటులో ఉండే వ్యవసాయాధికారులను సంప్రదించి వారు సూచించిన మోతాదులో మందులు చల్లాలన్నారు.

స్పృహ కోల్పోయిన కార్మికురాలికి సేవలు





నిజామాబాదనాగారం: విధి నిర్వహణలో భాగంగా మున్సిపల్ కార్మికురాలు లక్ష్మి అటెండెన్స్ అనంతరం పనులు చేయడానికి కంఠేశ్వర్ ప్రాంతంలో రోడ్లను శుభ్రం చేస్తోంది. అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో రోడ్డుపైనే పడిపోయింది. ఇది గమనించిన వాకింగ్‌కు వెళ్లే స్థానికులు ఆమె దగ్గరకు వెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం స్పృహలోకి వచ్చింది. తన పేరు లక్ష్మి అని ప్రతినిత్యం ఇక్కడే విధులు నిర్వహిస్తానని తెలిపింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు ఆమెను క్షేమంగా ఇంటికి పంపించారు. మూడు రోజుల నుంచి చలితీవ్రత పెరగడంతో ఫిట్స్ వచ్చినట్లు తెలిసింది.

2,374 అభ్యంతరాలు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ గడువు బుధవారంతో ముగిసింది. 60 రోజుల్లో 2,374 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో 538 లీగల్ నోటీసులున్నాయి. బల్దియా అధికారులు వీటిని కూడా అభ్యంతరాలుగానే పరిగణించారు. ఇండస్ట్రియల్, గ్రీన్, రిక్రియేషన్ జోన్లతో పాటు, 100, 80, 60 ఫీట్ల రోడ్లను మార్పు చేయాలన్న అంశాలపై ఎక్కువగా అభ్యంతరాలు నమోదయ్యాయి. లింగాపూర్, దేవునిపల్లి, ఇల్చిపూర్, అడ్లూర్, టేక్రియాల్, సిరిసిల్లరోడ్, రామేశ్వరపల్లి, పాతరాజంపేటతో పాటు పట్టణ ప్రజలు, రైతులు భారీగా దరఖాస్తులు ఇచ్చారు. పెద్ద ఎత్తున అభ్యంతరాలు రావడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. అభ్యంతరాల పరిశీలన తర్వాత మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, చర్చించి తీర్మానం చేసే అవకాశాలున్నాయి. కౌన్సిల్ ఆమోదం అనంతరం తుదిప్లాన్‌ను ప్రభుత్వానికి నివేదిస్తారు. కాగా ఎక్కువగా అభ్యంతరాలు వస్తే అవసరమైన మార్పులు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు అభ్యంతరాల సంఖ్యను చూసి మార్పులు చేస్తారా లేక వాటిని పరిగణనలోకి తీసుకోకుండా యథావిధిగా కొనసాగిస్తారా అన్న విషయమై సందిగ్ధత నెలకొంది. అయితే మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఇప్పటికే రైతులు ఉద్యమాలు చేస్తున్నారు.

మళ్లీ కొనుగోళ్లు !



అధ్యాపకులతో మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్

- ఎల్‌సీడీలు, కంప్యూటర్‌లు, కలర్ ప్రింటర్లు అడిగిన అధ్యాపకులు
- ఈ సారైనా ఈ-టెండరు ద్వారా కొనుగోళ్లు జరిగేనా..?

తెయూ (డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో మరోసారి అడ్డగోలు కొనుగోళ్లకు తెరలేపారు. కొద్ది నెలల క్రితమే కమీషన్ల కక్కుర్తితో పాలకమండలి (ఈసీ) అనుమతి లేకుండా, ఈ-టెండర్లు పిలువకుండానే కంప్యూటర్లు, ప్రింటర్లు, జిరాక్స్ మిషన్లు లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన సంగతి వివాదంగా మారిన విషయం తెలిసిందే. ఇదే విషయమై గత డిసెంబర్ 1న ఇద్దరు పాలకమండలి సభ్యులు కలిసి తెయూ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్‌ను ప్రశ్నించగా మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదని ఆయన వారిపట్ల దురుసుగా వ్యవహరించి క్యాంపస్ నుంచి పంపించివేశారు. 13 నెలలు దాటినా ఇంతవరకు ఈసీ సమావేశం నిర్వహించడం లేదని వీసీ పై విమర్శలు వస్తున్నా పట్టించుకోవడం లేదు.

మీకు ఏం కావాలో చెప్పండి.. కొనిస్తాం..

తెయూ పరిపాలనా భవనం ఎగ్జిక్యూటివ్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం అన్ని విభాగాల రెగ్యులర్ అధ్యాపకులతో వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా వచ్చిన వారందరితో రిజిస్టర్‌లో సంతకాలు తీసుకున్నారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధికి అందరూ కృషిచేయాలని విభాగాల వారీగా ఏమేం కావాలో అడగాలని కొనుగోలు చేసి ఇస్తామని పేర్కొన్నారు. దీంతో కొందరు అధ్యాపకులు ఉత్సాహంగా విభాగాల వారీగా కంప్యూటర్‌లు, లాప్‌టాప్‌లు, కలర్ ప్రింటర్లు, ఎల్‌సీడీలు కావాలని కోరారు. అయితే పలు విభాగాలకు ఇప్పటికే కంప్యూటర్లు, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్లు ఉన్నాయి. అయినా సరే ఇచ్చినప్పుడే తీసుకుంటే సరి అనుకుంటూ మళ్లీ ఈ సారి కొత్తగా లాప్‌టాప్‌లు, ఎల్‌సీడీలు, కలర్ ప్రింటర్లు కావాలని కోరడం మిగిలిన వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఏదైనా కళాశాల భవనంలోని సెమినార్ హాల్స్‌లో ఎల్‌సీడీలు ఉంటే సరిపోతుందని, విభాగాల వారీగా ఎల్‌సీడీలు ఏం చేసుకుంటారని కొందరు అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా క్యాంపస్‌లో బాలికల వసతి గృహం నిర్మాణం అత్యవసరం కాగా, సోషల్ సైన్స్ భవన నిర్మాణం చేపట్టాలని కొందరు అడగటం గమనార్హం.

పాలకమండలి సమావేశంలో ఈ-టెండర్లు లేకుండా ఎలాంటి కొనుగోళ్లు చేయవద్దని, అనుమతి లేకుండా ఎలాంటి నియామకాలు చేపట్టవద్దని ఖచ్చితమైన తీర్మానాలు చేశారు. కొద్ది రోజులు మిన్నకుండిపోయిన వర్సిటీ ఉన్నతాధికారులు ఇటీవల మళ్లీ రోజుకూలీల పేరిట సుమారు 55 మంది సిబ్బందిని నియమించారు. ఇలా ఈసీ తీర్మానాలను బేఖాతరు చేస్తూ కేవలం కమీషన్లు, నిధుల దుర్వినియోగం కోసమే మరోసారి కొనుగోళ్ల కు తెరలేపడం క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సారైనా ఇ- టెండర్ ద్వారా కొనుగోలు చేస్తారా లేదా కమీషన్ల కక్కుర్తి ప్రదర్శిస్తారో వేచిచూడాల్సిందే. ఈ సమావేశంలో ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి విద్యావర్ధిని, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ, ఈసీ మెంబర్లు ప్రొఫెసర్ నసీం, డాక్టర్ రవీందర్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి..



చెరువు కట్టపైకి వెళ్లకుండా గేటుకు తాళం



చెట్టు ఎండిపోవడంతో తొలగించిన దృశ్యం

- కొనసాగుతున్న బొడ్డెమ్మ చెరువు సుందరీకరణ పనులు
- రూ. 4 కోట్లతో ప్రారంభమై.. రూ. 22 కోట్లకు పెరిగిన వ్యయం
- చెరువుకట్ట ఎక్కే అవకాశం లేకుండా గేట్లు పెట్టి తాళాలు వేసిన పరిస్థితి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ బొడ్డెమ్మ చెరువు (రఘునాథ చెరువు) సుందరీకరణ పనుల తీరు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. నగర ప్రజలకు ఆహ్లాదం అందించే ఉద్దేశంతో 2016 జనవరి 21న రూ.4 కోట్లతో చేపట్టిన బొడ్డెమ్మ చెరువు సుందరీకరణ పనులు ముందుకు సాగడంలేదు. ఒక్క ట్యాంక్‌బండ్ సుందరీకరణకే ఏళ్లతరబడి సమయం తీసుకుంటున్నారంటే పనుల తీరు ఏంటో అర్థం చేసుకోవచ్చు. రూ. 4కోట్ల నుంచి రూ. 22 కోట్లకు ట్యాంక్‌బండ్ సుందరీకరణ వ్యయం పెంచుకుంటూ వచ్చారు. ఒకవైపు పనులు నత్తనడకన సా..గుతుండగా, మరోవైపు నాణ్యతపైనా అనుమానాలు తలెత్తుతు న్నాయి. పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో చిన్న వర్షం వస్తే కట్టపై మట్టి కుంగిపోయింది. కంకర తేలిపోయింది. గ్రానైట్ బండలు ఊడిపోయాయి. 2017లో ఒకసారి కట్ట తెగి నీరంతా వృథాగా పోయింది. పుట్ పాత్ బండలు ఊడిపోయాయి. నాలుగు చోట్ల కట్టిన బతుకమ్మ ఘాట్ల పనులు నాసిరకంగా ఉన్నాయి. అంతేకాకుండా పనుల అంచనా వ్యయాన్ని కూడా పెంచుకుంటూ పోయారు. మొదట రూ. 4కోట్ల నుంచి రూ. 7కోట్లకు, తర్వాత మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి 2017లో రూ. 14కోట్లు, తరువాత రూ. 22కోట్లకు పెరిగింది. పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులకు సంబంధించి ఎక్కడికక్కడ డొల్లతనం బయటపడుతుండడంతో ట్యాంక్‌బండ్ కట్టకు ఇరువైపులా గేట్లు పెట్టి తాళాలు వేసి ఎవరినీ వెళ్లకుండా చూస్తుండడం గమనార్హం. సుందరీకరణ సంగతేమో కానీ నగర ప్రజలకు చెరువు కట్ట చూసే అవకాశాన్ని సైతం లేకుండా చేశారు. ఎప్పటికి పనులు పూర్తి చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పలుసార్లు ఆదేశించినప్పటికీ సదరు కాంట్రాక్టర్ మాత్రం నాకేం ఇబ్బంది అన్నట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇక నిజామాబాద్ నగరాభివృద్ధి విషయమై ఏకంగా సీఎం కేసీఆరే సమీక్ష చేయాల్సి వచ్చింది. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి ఖమ్మం నగర అభివృద్ధిని చూసి రావాలని ఎమ్మెల్యే, అధికారులకు సూచించారు. దీంతో అక్కడకు వెళ్లి చూసి వచ్చారు. అయినప్పటికీ నగర అభివృద్ధి పనుల విషయంలో మార్పు లేకపోయింది. కనీసం ఒక్క ట్యాంక్‌బండ్‌నూ గత 8 ఏళ్లుగా సుందరీకరించకపోతుండడంపై నగర ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిలోపు పరిహారమిచ్చేలా సంస్కరణలు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్/సిరికొండ: ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందిన బాధిత కుటుంబాలకు ఏడాదిలోపే నష్టపరిహారమిచ్చేలా ఆర్టీసీలో సంస్కరణలు తీసుకొచ్చామని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం నిజామాబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ గతేడాది జూలైలో సిరికొండ మండలం సర్పల్లిచెరువు తండా జీపీ పరిధిలోని ఒడ్డెర కాలనీకి చెందిన ఢీకొని బోదాసు నర్సయ్య ఆర్టీసీ బస్సు ఢీకొని మృతిచెందాడని తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో కోర్టులో టీఎస్ ఆర్టీసీ సెటిల్‌మెంట్ చేసుకుని ఆర్టీసీ చరిత్రలోనే మొదటిసారిగా ఆరునెలల్లోనే బాధిత కుటుంబానికి రూ.10లక్షల చెక్కును అందజేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డీసీసీబీ డైరెక్టర్ గొర్కంటి లింగన్న, కోర్వ దేవేందర్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బాజిరెడ్డి

రూ. 10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన సుదర్శన్ గౌడ్ కుటుంబానికి మంజూరైన రూ. 10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అందించారు. సుదర్శన్ గౌడ్ కూతురు అనారోగ్యంతో చనిపోయింది. అనంతరం సామ్యనాయక్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ మోతీ లాల్ నాయక్ ఇటీవల మృతిచెందడంతో అతని కుటుంబ సభ్యులను బాజిరెడ్డి పరామర్శించారు.

ఐదు కిలోలతోనే సరి..!

- ప్రారంభమైన రేషన్ బియ్యం పంపిణీ
- రాష్ట్ర కోటా ఖరారు కాకపోగా ఆలస్యం?
- 6,020 మెట్రిక్ టన్నులు అవసరం..
- పండుగకు తక్కువగా పంపిణీ చేయడంపై నిరుపేదల్లో అసంతృప్తి



నగరంలోని ఓ రేషన్‌షాపులో బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: పండుగ వేళ రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రతకార్డుదారులకు మొండి చెయ్యి చూపించింది. 28 నెలలపాటు ఒక్కో లబ్ధిదారుడికి 10 కిలోలచొప్పున ఉచితంగా పంపిణీ చేసిన బియ్యం కోటా కాస్తా ఐదు కిలోలకు తగ్గించారు. కేంద్రం ప్రకటించిన ఐదు కిలోలు మాత్రమే ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి రాష్ట్ర సర్కారు చేతులు దులుపుకుంటుంది. బియ్యం పంపిణీ ఆలస్యమైనా తీపి కబురు వస్తుందని ఎదురుచూసిన కార్డుదారులకు నిరాశ తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ కోటా ఖరారు కాకపోవడంతో పంపిణీ ఆలస్యమైందనే ప్రచారం సాగింది. కాగా సంక్రాంతి పండుగకు పిండి వంటలు చేసుకునే కార్డుదారులు 5 కిలోలు పంపిణీ చేస్తుండడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 751 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. మొత్తం 4,05,115 ఆహారభద్రత, అంత్యోదయ కార్డుదారులు ఉన్నారు. ఒక్కో కార్డుదారుడికి 5 కిలోల చొప్పున మొత్తం 6,020 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. అందులో ఇప్పటికే 90శాతం వరకు రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా పూర్తయ్యింది. మన జిల్లాకు సంబంధించిన బియ్యాన్నే ఈసారి పంపిణీ చేస్తున్నారు. చివరకు రాష్ట్రం తన వాటా ఇవ్వకుండానే కేంద్రం ప్రకటించిన 5 కిలోలను ఉచితంగా పంపిణీ చేస్తోంది.

మొదలైన పంపిణీ..

సంక్రాంతి పండుగ వేళ రేషన్ బియ్యం పంపిణీ ఆలస్యమైంది. ప్రతినెలా 1, 2 తేదీల నుంచి పంపిణీ చేసేవారు. కానీ ఈసారి రాష్ట్ర కోటా ఖరారు కాకపోవడంతో ఆలస్యం జరిగింది. బుధవారం నుంచి పంపిణీ ప్రారంభించారు. పంపిణీ ఆలస్యం కావడంతో కొన్ని రేషన్‌దుకాణాల వద్ద క్యూలు దర్శనమిచ్చాయి. కార్డుదారులు 5 కిలోల బియ్యంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే 90శాతం బియ్యం దుకాణాలకు చేరింది. పంపిణీ ప్రారంభం కావడంతో మిగతా 10శాతం కూడా సరఫరా చేస్తున్నారు. కాగా కేవలం ఐదు కిలోలు మాత్రమే పంపిణీ చేయడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

10 కిలోలు ఇవ్వాలి



సంక్రాంతి పండుగ సమయంలో ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం ఇస్తే బాగుండేది. ఐదు కిలోలతో నెలంతా తినలేం. రెండేళ్లుగా 10 కిలోలిచ్చి.. ఇప్పుడు 5 కిలోలు ఇస్తే ఎలా బతకాలి. ప్రభుత్వం ఎలాగైనా 10 కిలోలు ఇవ్వాలి. లేకుంటే మాలాంటి నిరుపేదలు ఏం తిని బతకాలి. బయట మార్కెట్‌లో బియ్యం కిలోకు రూ. 40పైనే విక్రయిస్తున్నారు.

– తలారి శోభ, మోపాల్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ చేస్తున్నాం. ఒక్కో లబ్ధిదారుడికి 5 కిలోల బియ్యం పంపిణీ చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. ఇప్పటికే 90శాతం బియ్యం రేషన్‌షాపులకు సరఫరా చేశాం. మిగతావి కూడా రెండ్రోజుల్లో పూర్తి చేస్తాం. ఆలస్యమైనందుకు లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–చంద్రప్రకాశ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

బాస్‌లకు జిల్లాతో అనుబంధం

- జేసీగా సేవలందించిన శాంతికుమారి
- డీఐజీగా విధులు నిర్వర్తించిన అంజనీకుమార్
- ముఖ్య అధికారుల్లో చాలామంది జిల్లాలో పనిచేసినవారే



శాంతికుమారి



అంజనీకుమార్

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర పరిపాలనలో ముఖ్య భూమిక పోషించే చీఫ్ సెక్రెటరీగా బుధవారం బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి శాంతికుమారికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో అనుబంధం ఉంది. అలాగే రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి(డీజీపీ)గా ఇటీవలే నియమితులైన అంజనీకుమార్ కూడా ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వర్తించినవారే..

శాంతికుమారి 1997–98 లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆమె ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో పర్యటించారు. సీఎంవో స్పెషల్ సెక్రెటరీగా పనిచేసిన సమయంలో పలుమార్లు జిల్లాకు వచ్చారు. రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి(డీజీపీ)గా నియమితులైన అంజనీకుమార్ నిజామాబాద్ రేంజ్ డీఐజీగా పనిచేశారు. దీంతో ఆయనకు ఉమ్మడి జిల్లా మీద అవగాహన ఉంది. అలాగే ఉమ్మడి జిల్లాలో కలెక్టర్లుగా, జాయింట్ కలెక్టర్లుగా, ఎస్పీలుగా, ఏఎస్పీలుగా, డీఎస్పీలుగా పనిచేసిన ఎంతోమంది అధికారులు రాష్ట్ర స్థాయిలో కీలక స్థానాల్లో ఉన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గతంలో పనిచేసిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల ప్రస్తుత బాధ్యతల వివరాలు..

ఐఏఎస్‌లు...		సీవీ ఆనంద్(ఎస్పీ)	అదనపు డీజీపీ, యాంటీ నార్కోటిక్స్
అధికారి పేరు	ప్రస్తుత బాధ్యత	విక్రమ్‌సింగ్ మాన్(ఓఎస్‌డీ)	అదనపు కమిషనర్, హైదరాబాద్ సిటీ
శశాంక్ గోయల్(కలెక్టర్)	అడిషనల్ సెక్రెటరీ, కార్మిక శాఖ	చంద్రశేఖర్‌రెడ్డి(ఎస్పీ)	ఐజీ
నీతూ కుమారి(కలెక్టర్)	వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్	దుగ్గల్(ఎస్పీ)	డైరెక్టర్, క్లాస్ వన్ ఎక్స్‌క్యూటివ్ క్యాడర్
క్రిస్టీనా జెడ్ చోంగ్తూ(కలెక్టర్)	గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్	కార్తికేయ(సీపీ)	డీఐజీ ఇంటెలిజెన్స్
రొనాల్డ్ రోస్(కలెక్టర్)	ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి	రాజీవ్ రతన్(కామారెడ్డి ఏఎస్పీ)	అదనపు డీజీపీ, తెలంగాణ పోలీస్ హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్
యోగితారాణా(కలెక్టర్)	పెద్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్		
సత్యనారాయణ(కలెక్టర్)	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్	కే.శ్రీనివాస్‌రెడ్డి(కామారెడ్డి ఏఎస్పీ)	అదనపు డీజీపీ, ఆర్గనైజేషన్ అండ్ లీగల్
టీకే శ్రీదేవి(కామారెడ్డి ఆర్డీవో)	ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి	అనిల్‌కుమార్(కామారెడ్డి ఏఎస్పీ)	అదనపు డీజీపీ, ఇంటెలిజెన్స్
ఐపీఎస్‌లు..		అభిలాష్ బిస్త్(బోధన్ ఏఎస్పీ)	అదనపు డీజీపీ, సంక్షేమం
సంజయ్‌కుమార్ జైన్(ఓఎస్‌డీ)	అదనపు డీజీపీ లా అండ్ ఆర్డర్	పరిమళ(కామారెడ్డి డీఎస్పీ)	జాయింట్ కమిషనర్, హైదరాబాద్ సిటీ

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం

- అవగాహన సదస్సులో ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు
- కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- బ్రోచర్లు, కరపత్రాల ఆవిష్కరణ



బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎమ్మెల్యే బిగాల, కలెక్టర్ నారాయణరెడ్డి

సుభాష్‌నగర్: దృష్టి లోపాలను దూరం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం 18 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేద్దామని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. కొత్త కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి నేతృత్వంలో కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడుతూ దేశంలోనే మరెక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వినూత్న ఆలోచనలతో ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో ఉన్నప్పుడే బంగారు తెలంగాణ లక్ష్యం నెరవేరుతుందనే ప్రగాఢ విశ్వాసంతో విస్తృత స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఇందులోభాగంగానే సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని సూచించారు.

12లక్షలకు పైగా మందికి నేత్ర పరీక్షలు చేస్తాం

కంటి వెలుగు ముఖ్య ఉద్దేశం, విజయవంతం చేయాల్సిన ఆవశ్యకతపై కలెక్టర్ నారాయణరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 18 ఏళ్లకు పైబడిన 12,32,872 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అన్ని జీపీలు, మున్సిపల్ వార్డుల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించేందుకు వీలుగా 70 బృందాలు ఏర్పాటు చేశామని, కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అప్పటికప్పుడు మందులు, కంటి అద్దాలు అందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాకు 61,200 అద్దాలు చేరుకున్నాయని వివరించారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని, పక్షం రోజుల్లోపు వారికి కంటి అద్దాలు సమకూరుస్తామని తెలిపారు. 18ఏళ్ల పైబడిన వారందరూ తప్పనిసరిగా కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై పరిపూర్ణ అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన డెమో ప్రదర్శనను ప్రజాప్రతినిధులు తిలకించారు. కంటివెలుగు బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. సదస్సులో ఎమ్మెల్సీ రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్లు తూము పద్మ, వినీత పండిత్, కన్నెగంటి ప్రేమలత, జెడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, నోడల్ అధికారి అమర్‌సింగ్ నాయక్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రవాసి భారతీయ దివస్‌లో సోమ రవి



పెర్కిట్: మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈ నెల 8 నుంచి నిర్వహించిన ప్రవాసి భారతీయ దివస్ కార్యక్రమంలో ఆలూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోమ రవి పాల్గొన్నారు. ఇజ్రాయిల్‌లో ఉంటున్న ప్రవాసి భారతీయుల ప్రతినిధిగా ఆయనకు ఆహ్వానం లభించింది. మధ్య ప్రదేశ్ ప్రభుత్వం ప్రవాస భారతీయులకు గౌరవంతో స్వాగతం పలికిన తీరు మరువలేనిదని ఈ సందర్భంగా రవి తెలిపారు.

రవాణా శాఖ ఆఫీసులో మహిళల తంటాలు



కామారెడ్డిఅర్బన్:కామారెడ్డి రవాణా శాఖ కార్యాలయంలో మహిళల ఇబ్బందులను పట్టించుకునేవారు కరువయ్యారు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి వద్ద గల జిల్లా రవాణా శాఖ ఆఫీసుకు లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, ఇతర పనులపై వచ్చే మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.తమకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయకపోవడంపై మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఖలీల్‌వాడి:ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో మమత విధులకు గైర్హాజరు అవుతున్నారని, కిందిస్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ నారాయణరెడ్డికి ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఆమె గతంలో కూడా విధులకు హాజరు కాలేదని, ఒకేసారి హాజరు పట్టికలో సంతకాలు చేసినట్లు కలెక్టర్ దృష్టికి యూనియన్ నేతలు తీసుకువెళ్లారు. ఈ నెల 6 నుంచి 9 వరకు అనుమతి లేకుండా గైర్హాజరు అయినట్లు చెప్పారు. ఎక్సైజ్ సీఐ మమతపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఈ రవి, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్, భోజన్న, దీపిక ఉన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ(యూజీ) సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 3,932 మంది విద్యార్థులకు 3,728 మంది హాజరు కాగా 204 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆర్మూర్‌లోని సిద్ధార్థ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టరు రెగ్యులర్, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 10,390 మందికి 9,614 మంది హాజరైనట్లు వివరించారు.

25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షల ఫీజు ఈ నెల 25లోగా చెల్లించాలని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయని పేర్కొన్నారు. బీఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.800, బీకాం, బీఎస్సీ రూ.900, బీబీఏ రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 27వరకు, రూ.500 అపరాధ రుసుముతో 28వరకు ఫీజు చెల్లించవచ్చని వివరించారు. వివరాలకు www.telanganauniversity.ac.inను సంప్రదించాలన్నారు.

స్కీం పేరుతో టోపీ!

- వేల్పూర్ కేంద్రంగా సాగిన లక్కీ డ్రా స్కీం ముగిసి ఏడు నెలలు
- ఇప్పటివరకు సభ్యులకు బహుమతులు ఇవ్వని నిర్వాహకులు
- డబ్బులు వాపసు ఇవ్వాలని కోరితే బెదిరింపులు



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన కొలిప్యాక అశోక్ వేల్పూర్ కేంద్రంగా నిర్వహించిన ఒక స్కీంలో సభ్యుడిగా చేరాడు. 16 నెలల పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున అతను రూ.16వేలు చెల్లించాడు. స్కీం కాలపరిమితి ఏడు నెలల కింద ముగిసిపోయింది. స్కీం నిర్వాహకులు అశోక్‌కు ఏదో ఒక బహుమతి లేదా అతను చెల్లించిన మొత్తంలో స్కీం లాస్ కింద కొంత డబ్బు మినహాయించుకుని మిగిలిన మొత్తంను వాపసు చేయాలి. అశోక్‌కు బహుమతి ఇవ్వకుండా, డబ్బులు వాపసు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఇదేంటని అశోక్ నిర్వాహకులను ప్రశ్నిస్తే ఏమి చేసుకుంటావో చేసుకో ఇంకా ఏమైనా అంటే మేమే పోలీసు కేసు పెడతామని బెదిరిస్తున్నారు. ఇది ఒక్క అశోక్‌కు ఎదురైన చేదు అనుభవమే కాదు ఎంతో మంది స్కీం సభ్యులకు కలిగిన నష్టం. లక్కీ డ్రా స్కీంలో సభ్యులుగా చేరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఆశించిన అనేక మందికి స్కీం నిర్వాహకులు కుచ్చుటోపి పెట్టారు. 2,500 మందిని సభ్యులుగా చేర్చుకుని ఒక్కో సభ్యుని వద్ద రూ.వెయ్యి చొప్పున, 16నెలల పాటు కట్టించుకున్నారు. ఎవరైనా సభ్యులు మధ్యలో బహుమతులను గెలుపొందితే వారు మళ్లీ సొమ్ము జమ చేసే అవసరం లేదు. సభ్యులుగా చేరిన వారి నుంచి నిర్వాహకులు రూ.3 కోట్ల వరకు వసూలు చేశారు. నిర్వాహకులు ప్రచురించిన బ్రోచర్‌ను పరిశీలిస్తే బహుమతుల కోసం రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తే మరో రూ.1.50 కోట్లను లాభంగా వెనుకేసుకోవచ్చు. స్కీం నిర్వహణతో సభ్యులలో కొంత మందికి ఎక్కువ లాభం జరగాల్సి ఉండగా, నిర్వాహకులకు మాత్రం పెద్ద మొత్తంలో మిగులుబాటు అవుతుంది. చివరి వరకు ఎలాంటి బహుమతిని గెలుచుకోని వారికి కన్సోలేషన్ బహుమతి లేదా కొంత నగదు వాపసు ఇవ్వాల్సి ఉంది. దాదాపు 1,500 మందికి ఎలాంటి బహుమతి, నగదు వాపసు ఇవ్వకుండా నిర్వాహకులు వంచించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో దొన్కల్ కేంద్రంగా నిర్వహించి లక్కీ డ్రా విషయంలోను నిర్వాహకులు అనేక మందికి టోపీ పెట్టారు. ఇప్పుడు వేల్పూర్ కేంద్రంగా సాగిన లక్కీ డ్రా పరిస్థితి అంతే ఉంది.

ఇరకాటంలో ఏజెంట్లు

లక్కీ డ్రా నిర్వాహకులు గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని వారికి కమీషన్ ఆశచూపారు. వారు తమకు పరిచయం ఉన్నవారిని సభ్యులుగా చేర్పించి డబ్బులు కట్టించారు. ఇప్పుడు నిర్వాహకులు చేతులెత్తి వేయడంతో ఏజెంట్లపై సభ్యులు ఒత్తిడి పెంచారు. కమీషన్‌కు ఆశపడినందుకు తమకు గుణపాఠం జరిగిందని వారు వాపోతున్నారు. నిర్వాహకులలో కొందరు అధికార పార్టీకి చెందినవారు అని ప్రచారం జరుగుతోంది. అందువల్లనే పోలీసులు కూడా ఏమి చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి స్కీం నిర్వాహకుల నుంచి తమకు డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

పనులు వేగవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

భీమ్‌గల్: మన ఊరు – మన బడి, క్రీడా ప్రాంగణాల పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఈవో దుర్గాప్రసాద్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని చేంగల్, బడా భీమ్‌గల్, ముచ్కూర్, పల్లికొండ గ్రామాల్లోని హరితహారం, క్రీడా ప్రాంగణాలు, మన ఊరు – మన బడి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. ఎంపీఓ గంగమోహన్, ఏపీఓ నర్సయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజలు

బాన్సువాడ టౌన్: పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కొన్ని సమస్యలను పరిష్కరించగా.. మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీజీఆర్‌ఎఫ్ సభ్యులు అశోక్, కిషన్, భూమారెడ్డి, డీఈ కామేశ్వర్‌రావు, ఏఈ నాందేవ్ తదితరులు ఉన్నారు.

బాల్కొండలో ఈజీఎస్ ప్రజావేదిక



ఈజీఎస్ ప్రజావేదికలో డీఆర్‌డీవో చందర్ నాయక్, ఎంపీపీ లావణ్య తదితరులు

బాల్కొండ: మండల కేంద్రంలో బాల్కొండ మండల ఈజీఎస్ 14వ సోషల్ ఆడిట్ ప్రజావేదికను బుధవారం ఎంపీపీ లావణ్య అధ్యక్షతన డీఆర్‌డీవో చందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2019 నుంచి 2023 వరకు మూడు సంవత్సరాల్లో, పది గ్రామాల్లో రూ.6 కోట్ల 73 లక్షలతో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. గ్రామ సభల్లో చదవని ఆడిట్ లెక్కలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఓ గ్రామంలో రూ.50 వేలతో శ్మశానవాటికలో సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు బిల్లులు ఎత్తారు. కానీ అక్కడ సోలార్ లైట్లు గానీ, స్తంభం కాని లేదని ఆడిట్‌లో తేలింది. వాటిని దొంగలు ఎత్తుకెళ్లారని సంబంధిత అధికారులు తెలిపి చేతులు దులుపుకున్నారు. ఇలా గ్రామాల్లో అనేక పనులు చేట్టకుండానే బిల్లులు లేపేసినట్లు తేలింది. కొందరు కూలీలు సంతకాలు లేకుండానే కూలి డబ్బులు తీసుకున్నారు. మస్టర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయకుండానే ఎంబీలు రికార్డు చేసి బిల్లులు ఎత్తారు. ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనుల్లో అవినీతిపై నామమాత్రంగానే జరిమానాలు విధిస్తూ ప్రజావేదికను ముగించారు. బాల్కొండలో ఈజీఎస్ ప్రజా వేదిక ప్రజలు లేకుండానే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వీఎస్‌ఏలు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ప్రజలు వస్తే అవినీతిని ప్రశ్నించే ప్రమాదం ఉందని అధికారులు నామమాత్రంగా నిర్వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

‘పీజీ’కి ఎంపికైన ఏవో

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారి సంతోష్‌కుమార్ హైదరాబాద్‌లోని ప్రొఫె సర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ చదువు కోసం ఎంపికైనట్లు ఏఈవోలు బుధవారం తెలిపారు. ఎంఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ఆయనకు సీటు వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో నలుగురు ఏవోలు పీజీ కోసం ఎంపిక కాగా అందులో ఎల్లారెడ్డి ఏవో ఒకరు అని చెప్పారు.

ఆర్చరీలో శిక్షణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నాగారం రాజారాం స్టేడియంలో జిల్లాలోని క్రీడాకారులకు ఆర్చరీలో శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఖేలో ఇండియాలో భాగంగా జిల్లా క్రీడల యువజన అధికారి ముత్తెన్న శిక్షణను ప్రారంభించారు. కోచ్ మురళి శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోచ్ సూచించారు. వివరాలకు కోచ్ సెల్ 9848919480, 9701177144 నంబర్లను సంప్రదించాలన్నారు.

పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరెడ్డి బుధవారం సందర్శించారు. సెక్టార్ ఎస్సైలు, సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు తగ్గేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఠాణా పరిధిలో ఎక్కువగా జరుగుతున్న నేరాల గురించి ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. నేరస్తులపై ఖచ్చితమైన నిఘా ఉంచాలన్నారు. ఆస్తి సబంధిత నేరాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాదికి సంబంధించి ఆస్తి సంబంధిత నేరాల్లో 76 శాతం ఛేదించినందుకు ఎస్‌హెచ్‌ఓ, సిబ్బందిని అభినందించారు.

ఠాణా భవనానికి మోక్షం!



ప్రారంభానికి సిద్ధమైన భవనం

- 2017లో పనులు మొదలు
- ఎట్టకేలకు నిర్మాణం పూర్తి
- ప్రారంభానికి ఏర్పాట్లు

బాల్కొండ: బాల్కొండలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. 2017లో మోడల్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అదే సంవత్సరం పనులకు శంకుస్థాపన చేశారు. నత్తనడకన సాగిన పనులు రెండేళ్ల క్రితమే పూర్తయ్యాయి. కానీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. నూతన భవనం నిరుపయోగంగా ఉండటంతో పూర్తి స్థాయి పనులు వెంటనే చేపట్టాలని పాలకులు ఆదేశించారు. కార్యాలయంలో ఫర్నిచర్ లేకపోవడంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. దీంతో ప్రస్తుతం ఆపనులు కూడా పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తవుతున్న పోలీస్ స్టేషన్ భవనాన్ని మంగళవారం సీపీ నాగారాజు పరిశీలించారు. త్వరలోనే ప్రారంభించుటకు ఏర్పాట్లు చేస్తున్నాట్లు తెలిపారు.

ఇక్కడే రూరల్ సీఐ కార్యాలయం

ఆర్మూర్ రూరల్ సీఐ కార్యాలయాన్ని బాల్కొండ ఠాణా ఆవరణలో ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బాల్కొండ, నందిపేట్, వేల్పూర్ స్టేషన్‌ల పరిధిలో ఆర్మూర్ రూరల్ సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాటు సమయంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ వద్ద భద్రత ఉంటుందని భావించి పోచంపాడ్‌లో గతంలోని పోలీస్ ఔట్‌పోస్టు కార్యాలయాన్ని వినియోగించారు. రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత పాలనపరంగా ఇబ్బందిగా ఉంటుందని భావించి ఆర్మూర్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆర్మూర్‌లోనే రూరల్ సీఐ కార్యాలయం కొనసాగుతోంది. ప్రస్తుతం మండలాలు పెరగడంతో పోలీస్ స్టేషన్‌లు కూడా పెరిగాయి. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, నందిపేట్, వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లు రూరల్ సర్కిల్ పరిధిలోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం బాల్కొండలో ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులు నిర్ణయించారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

పెర్కిట్: దేశంలో నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో గల క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించని స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు, క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, ఇందూరు యువత అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, దారం గంగాధర్, రామేశ్వర్ రెడ్డి, సంజీవ్‌రావు, సుజాత రెడ్డి, పుష్పవతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ





జాతీయ స్థాయికి ఎంపికైన కళాకారులు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీల్లో జిల్లా కళాకారులు ప్రతిభ చూపారు. జానపద గేయం విభాగంలో గీతాంజలి గ్రూప్ మొదటి బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే నాస్ కాంపిటేషన్‌లో ఉపన్యాసంలో తన్వి, చందరన, కబడ్డీలో ప్రియాంక జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి 16వరకు కర్ణాటకలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారు. కళాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న అభినందించారు.

రోడ్డుపైనే పోలీస్ వాహనాలు



కామారెడ్డి టౌన్: రోడ్లపై వాహనాలు నిలిపితే పోలీసులు ఫొటోలు తీసి చలాన్లు విధిస్తారు. వారే రోడ్లపై వాహనాలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రైతు ధర్నా నేపథ్యంలో బందోబస్తుకు బెటాలియన్ పోలీసులు రెండు డీసీఎం వాహనాల్లో వచ్చారు. ఆ వాహనాలను మున్సిపల్ కార్యాలయం ఎదుట చౌరస్తాలో చాలా సేపటి వరకు నడి రోడ్డుపై పార్కింగ్ చేసి ఉంచారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. విలేకరులు ఫొటోలు తీస్తున్నారని గమనించి అక్కడి నుంచి వాహనాలను తీసుకెళ్లారు.

టీపీసీసీ ఇన్‌చార్జిని కలిసిన జిల్లా నేతలు



మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన గడుగు గంగాధర్

నిజాంసాగర్/నిజామాబాద్ సిటీ: తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి కలిశారు. కాంగ్రెస్ ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం చెప్పారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆరేటి లక్ష్మీనారాయణ(60) మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని అర్సపల్లికి చెందిన లక్ష్మీనారాయణ మంగళవారం ఉదయం తన బావమరిది ఇంటికి పడకల్ వచ్చాడు. రాత్రి భోజనం చేసిన తర్వాత నిజామాబాద్‌కు వెళ్తానని చెప్పి ఆయన బయటకు వచ్చాడు. ఈ క్రమంలో అర్గుల్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీనారాయణ మేనల్లుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

భిక్కనూరు: భిక్కనూరుకు చెందిన ఓ వ్యక్తి రెండు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన కోరే బీరయ్య గొర్రెల కాపరీగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 9న ఇంట్లో నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో బీరయ్య భార్య లక్ష్మి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ చెప్పారు.

రుద్రూర్‌లో బైక్ దగ్ధం



రుద్రూర్: రుద్రూర్‌లో మంగలి గంగాధర్‌కు చెందిన బైక్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. గంగాధర్ రోజూ లాగా ఇంటి ముందు బైక్ పార్కు చేశాడు. రాత్రి వేళ పొగలు రావడంతో సమీపంలో ఉన్నవారు గుర్తించి బాధితుడిని నిద్రలేపారు. అప్పటికే బైక్ కాలిపోవడంతో గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్



మోపాల్: నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు మోపాల్ ఎస్సై మహేష్ తెలిపారు. బుధవారం మోపాల్ శివారులో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ లైసెన్సు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపించవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, బైక్‌పై ఇద్దరికి మించి ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తామన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో మంగళవారం రాత్రి అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై గణేష్ బుధవారం తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

30 తులాల బంగారం చోరీ

ఆలస్యంగా వెలుగులోకి ఘటన



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బాన్సువాడటౌన్: బాన్సువాడలోని చైతన్య కాలనీలో వారం రోజుల క్రితం చోరీ జరిగిన విషయం ఆలస్యంగా బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన బచ్చు భుజేందర్ అనే వ్యాపారి ఈ నెల 3న భార్యతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు, రూ.10 వేల నగదును బీరువాలో పెట్టి తాళం వేసి వెళ్లారు. అదే రోజు రాత్రి దంపతులిద్దరు ఇంటికి వచ్చారు. వెనుకాల ఉన్న తలుపునకు తాళం వేయడం మరిచినట్లున్నామని గ్రహించి ఎప్పటిలాగే ఇంట్లో ఉన్నారు. భుజేందర్ భార్య వసంత ఈ నెల 8న బీరువా తెరిచి బంగారం ఉన్న బ్యాగును చూసింది. ఆభరణాలు ఉన్న బ్యాగు కనబడకపోయే సరికి భర్త భుజేందర్‌కు విషయం చెప్పింది. ఇద్దరు బ్యాగు కోసం వెతికినా కనిపించలేదు. దీంతో బుధవారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను సేకరించారు.

బాబాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో..

భీమ్‌గల్: మండలంలోని బాబాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బాబాపూర్ గ్రామానికి చెందిన అలీముద్దిన్(50) తన కుటుంబ సభ్యులతో సోమవారం ఉదయం నిజామాబాద్ వెళ్లి, తిరిగి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చాడు. అప్పటికే తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 5 తులాల బంగారం, కొంత నగదు పోయిందని బాధితుడు అలీముద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.